క్లుప్తంగా

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ రేవతి తదితరులు

ముమ్మిడివరం: నవభారతి గ్రామీణ అభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ అంగడి రేవతి చేతుల మీదుగా 188 మంది పదో తరగతి విద్యార్థులకు, 22 మంది ఇంటర్ విద్యార్థులకు అందజేశారు. పాఠశాలల హెచ్ఎంలు బి. హనుమంతరావు, సీహెచ్ పరిమళ, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఐదుగురికి సేవా పురస్కారాలు

తాళ్లరేవు: ప్రభుత్వం వలంటీర్లకు వందనం పేరిట అందిస్తున్న సేవా పురస్కారాల్లో భాగంగా తాళ్లరేవు మండలం నుంచి సేవారత్న అవార్డులకు ఐదుగురు ఎంపికయ్యారని ఎంపీడీఓ కె.ప్రభాకర్‌రావు తెలిపారు. ఇంజరం-1 నుంచి నాగిడి దుర్గావతి, పి.మల్లవరం-2 నుంచి దున్నా మురళీకృష్ణ, జి.వేమవరం-2 నుంచి అయినవిల్లి దేవి, కోరంగి-2 నుంచి పెసింగి సూర్యకళ, సుంకరపాలెం నుంచి గురజాపు తాతాజీలు ఎంపికయ్యారన్నారు. సేవారత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తారని చెప్పారు.

రాజశ్యామల అమ్మవారికి పూజలు



విలసవిల్లిలో రామమందిరం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహాసౌరయాగంలో రాజశ్యామల అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అర్చకులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పండితులు గురువారం అశ్విని నక్షత్ర జాతకులచే ముషిణి చెట్టుకు పూజలు చేయించారు. దీంట్లో భాగంగా భక్తులతో గోపూజ, ఆదిత్య పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బీజేపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పెసల

యానాం: పుదుచ్చేరి బీజేపీ శాఖ సోషల్ మీడియా బృందాన్ని గురువారం సోషల్ మీడియా స్టేట్ ప్రెసిడెంట్ ఎం.మహేష్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా యానాం నుంచి ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా స్థానిక బీజేపీ సీనియర్ నాయకుడు పెసల వెంకటేష్ చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీలో కార్యవర్గంతో పాటు ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించారు. ఎంపికైన వెంకటేషను స్థానిక నాయకులు కాదా పవన్, హరిప్రసాద్ అభినందించారు.

పవన్‌కుమార్‌కు సత్కారం



పవన్‌ను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: దేశ వ్యాప్తంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ పరిక్రమ యాత్ర తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జిగా నియమితులైన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్‌ను అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గురువారం సత్కరించారు. సంఘం అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శులు కొమ్మూరి వెంకటాచల, కొవ్వూరి వెంకటరెడ్డి, చింతలపూడి సత్తిబాబు, మేడిచర్ల త్రిమూర్తులు తదితరులు పవన్‌ను అమలాపురంలోని ఆయన నివాసంలో కలిసి అభినందించారు.

విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన

అమలాపురం రూరల్: ప్రపంచ చిల్డ్రన్ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు డాక్టర్ విష్ణుమూర్తి క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత నంద్యాల మనోవిహార్, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, సప్పానాగేశ్వరావు, సెక్రటరీ వలవల వెంకటరెడ్డినాయుడు, ట్రెజరర్ పచ్చిగోళ్ళ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు బంగారు భవిష్యత్

- సుకన్య సమృద్ధి యోజనతో ఎంతో మేలు
- పదేళ్ల లోపు వయసున్న బాలికలు అర్హులు



బెండమూర్లంక పోస్టాఫీసు కార్యాలయం

అల్లవరం: బాలికల అభ్యున్నతికి, వారి బంగారు భవిష్యత్తుకి భరోసా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం సుకన్య సమృద్ధి యోజన. బేటీ బచావో.. బేటీ పఢావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై పోస్టల్ శాఖ క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పిస్తోంది. అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో అమలాపురం హెడ్ పోస్టాఫీస్ కేంద్రంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయ పరిధిలోని ఒక హెడ్ పోస్టాఫీస్, 68 బ్రాంచ్ పోస్టాఫీసులు, 14 సబ్ పోస్టాఫీసుల్లో కలిసి ఇప్పటి వరకూ పది వేలకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిచారు. పథకం గురించి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు పోస్టల్ శాఖ ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తుంది.

అమ్మాయి పుట్టినప్పటి నుంచి పదేళ్ల లోపు వయసున్న బాలికలకు ఆమె పేరు మీద తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరవొచ్చు. ఏడాదికి కనీసం రూ.1,000 నుంచి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకూ జమ చేసుకోవొచ్చు. ఖాతా ప్రారంభించినప్పటి నుంచి కనీసం 15 ఏళ్ల పాటు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. 21 ఏళ్ల కాల పరిమితి ముగిశాక చెల్లించిన పొదుపుపై వడ్డీతో కలిపి వెనక్కి ఇస్తారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఏడాదికి సుమారు 7.5 శాతం నుంచి 8 శాతం మేర వడ్డీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. అమ్మాయి పదో తరగతి ఉత్తీర్ణత తర్వాత 50 శాతం వరకూ డబ్బులను విత్‌డ్రా చేసుకునే సౌలభ్యం ఈ పథకంలో ఉంది. ఈ పథకంలో నిల్వ చేసే సొమ్ముకు, వడ్డీకి పన్ను రాయితీ లభిస్తుందని పోస్టల్ శాఖ అధికారులు చెబుతున్నారు. పోస్టాఫీసుకి రాలేనివారు ఖాతా ప్రారంభించిన తరువాత ఐపీపీబీ ద్వారా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లల భవిష్యత్‌కు కొండంత అండగా ఉందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచేందుకు బాలిక పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డుల జిరాక్స్‌లు, తల్లి లేదా తండ్రి రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు పోస్టాఫీసుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ఆడపిల్లలకు ఎంతో మేలు



ఆడపిల్లలున్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకంలో పొదుపు చేస్తే వారి భవిష్యత్తుకు ఎంతో మేలు జరుగుతుంది. అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో 10 వేల ఖాతాలు తెరిచాం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఆడబిడ్డ ఉన్న ప్రతి ఇంట్లో సుకన్య సమృద్ధి యోజన అకౌంట్ ఇవ్వడమే మా లక్ష్యంగా పెట్టుకున్నాం.

– వి.వంశీకృష్ణ, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, హెడ్ పోస్టాఫీసు, అమలాపురం

ఆర్థిక భరోసా లభిస్తుంది

సుకన్య సమృద్ధి యోజన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యుత్తమ పథకం. ఈ పథకంలో మా అమ్మాయి పేరిట ఖాతా తెరిచి ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపు చేస్తున్నాం. ఈ పథకంతో మా అమ్మాయి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా లభిస్తుంది.

– వీవీవీ సత్యలక్ష్మి, అనాతవరం

ప్రభుత్వ జీఓపై కృతజ్ఞతలు

ముమ్మిడివరం: సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకూ వర్తించే అధికారాలు, విధులు కల్పించేలా ప్రభుత్వం జీఓ నెంబర్-11 విడుదల చేయడంపై గ్రామ వార్డు సచివాలయంలో ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ధనశేఖర్ గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ పాలనను సరళీకృతం చేసినందుకు రాష్ట్రంలో ఉన్న 7 వేల మంది గ్రేడ్-5 కార్యదర్శుల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

22న సభలో మధ్యంతర బడ్జెట్

యానాం: మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఈనెల 22న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం కానుందని స్పీకర్ ఆర్.సెల్వం గురువారం తెలిపారు. ఆరోజు ఆర్థికశాఖను సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొన్ని నెలలకు గాను వివిధ శాఖలకు కావాల్సిన ఖర్చులకు సంబంధించి కేటాయింపుల గురించి వివరిస్తారన్నారు. ఈ మేరకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. అదేవిధంగా మార్చి కంటే ముందుగానే సివిల్ వర్క్స్‌ను త్వరగతిన పూర్తిచేయాలని సీఎం రంగసామి అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు.

ఆలోచింపజేసిన మాక్ డ్రిల్



తుఫాను సమాచారాన్ని అందిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్, మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం యానాంలో నిర్వహించిన మాక్ డ్రిల్ అందరినీ ఆలోచింపజేసింది. తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర విధులు, వివిధ శాఖల బాధ్యతలను తెలియజేస్తూ మాక్ డ్రిల్ సాగింది. ముందుగా స్టేట్ ఎమర్జన్సీ సెంటర్ పుదుచ్చేరి నుంచి బంగాళాఖాతంలో సైక్లోన్ ఏర్పడిందని దాని పేరు ఓలీగా నామకరణం చేసినట్లు అత్యవసర సందేశం యానాం ఆర్ఏఓ కార్యాలయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు స్థానిక మార్కెట్ వద్ద బేస్ క్యాంప్‌ను ఏర్పాటుచేసి ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక దళం, విద్యుత్, వైద్యం, పీడబ్ల్యూడీ తదితరశాఖల అధికారులు సమావేశమయ్యారు. అనంతరం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించి తీర గ్రామాలను అప్రమత్తం చేశారు. అనంతరం తుఫానుకు పడిపోయిన చెట్లను తొలగించడం, స్థానిక బోట్ హౌస్ వద్ద నుంచి గోదావరిలోకి వెళ్లిన బాధితులను తుఫాను రిలీఫ్ కేంద్రాలకు తరలించడం, ఆహార పొట్లాలను పంపిణీ చేయడం, బాధితులకు వైద్య సదుపాయాలను అందించడం, పడిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం మాక్ డ్రిల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, ఎస్ఐ నూకరాజు, విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అత్యవసరంగా సమావేశమైన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది



గోదావరిలో చిక్కుకున్న బాధితులను తీసుకొచ్చేందుకు వెళుతున్న బోట్లు

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



కేశనకుర్రులో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు పెదలంక గ్రామంలో గురువారం సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ బీర సత్యకుమారి, మండల పార్టీ అధ్యక్షులు పిన్నంరాజు వెంకటపతిరాజు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల వల్ల పేదలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.బాబ్జి రాజు, సొసైటీ అధ్యక్షులు ఇందుకూరి రంగరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ మోకా రవి, చెల్లి రమాదేవి, పొగాకు వెంకటేశ్వరావు, జనిపెల్ల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా క్లెయిమ్ చెక్కు అందజేత



సత్యశ్రీనివాస్ తల్లి మంగతాయారుకు రూ.10 లక్షల బీమా చెక్కు అందిస్తున్న ఎంపీ అనురాధ తదితరులు

అల్లవరం: ఇండియా పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారుడైన రాజోలు మండలానికి చెందిన ఉర్రింక రామ సత్యశ్రీనివాస్ ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్, టాటా ఏఐజీ బీమా కంపెనీ సంయుక్తంగా ఇచ్చిన రూ.10 లక్షల బీమా క్లెయిమ్ చెక్కును సత్య శ్రీనివాస్ తల్లి ఉర్రింక మంగతాయారుకు ఎంపీ చింతా అనురాధ చేతుల మీదుగా మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ పోస్టల్ శాఖలో ప్రవేశపెట్టిన ప్రమాద బీమాను 18 నుంచి 60 ఏళ్ల లోపున్నవారు వినియోగించుకోవాలన్నారు. ఏడాదికి కేవలం రూ.396 ప్రీమియంతో రూ. 10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఎంపీ కార్యాలయం వద్ద పోస్టల్ శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో అల్లవరం మండల జర్నలిస్టులకు ఎంపీ అనురాధ సొంత నిధులతో రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌పీఓఎస్ సీహెచ్ శ్రీనివాసరావు, ఐపీపీబీ మేనేజర్ రాజ్‌కుమార్, మెయిల్ ఓవర్సీస్ బసవా అనిల్, టాటా ఏఐజీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లరేవు: విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేదలకు ప్రైవేటు పాఠశాలలు కేటాయించే 25 శాతం సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, ఎం.ఉమ కోరారు. వచ్చే నెల 14వ తేదీ లోగా www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ పద్ధతిలో అర్హులను ఎంపిక చేశాక ఏప్రిల్ 16వ తేదీ నుంచి 23 వరకూ పాఠశాలల్లో ప్రవేశాలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులను లేదా మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

క్షయ రహిత సమాజమే ధ్యేయం

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి క్షయ రహిత సమాజానికి కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి సీహెచ్ వి.భరతలక్ష్మి కోరారు. క్షయ వ్యాధి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని జొన్నాడ, పెనికేరు, చింతలూరు, గుమ్మిలేరు, గ్రామాల్లో గురువారం పర్యటించారు. కుష్టు, క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగుల వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్స విధానంపై ఆరా తీశారు. వైద్యాధికారులు భవానీశంకర్, డి.సువర్చలాదేవి, కిమ్స్ వైద్యురాలు కె.ప్రసన్న, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, కో-ఆర్డినేటర్ వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

25న జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభం

- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

యానాం: కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.48.85 కోట్ల ఖర్చుతో నిర్మించిన జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ 100 పడకల ఆసుపత్రిని ఈ నెల 25న వర్చువల్ పద్ధతిలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. జిప్‌మెర్ ఆసుపత్రిలో సేవలు అందించేందుకు రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించిన పర్మినెంట్ వైద్యులు గురువారం ఆసుపత్రికి చేరుకున్నారు. గురువారం జిప్‌మెర్ ఆసుపత్రి ఆవరణలో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రారంభ కార్యక్రమాల ఏర్పాట్ల గురించి చర్చించారు. సోమవారం జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ రానున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్పీ రాజశేఖరన్, జిప్‌మెర్ అధికారులు పాల్గొన్నారు.



జిప్‌మెర్ ఆసుపత్రిలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

9 మంది సచివాలయ కార్యదర్శులకు డీడీఓ హోదా

అల్లవరం: మండలంలోని 9 మంది సచివాలయ కార్యదర్శులకు డీడీఓ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. మొగళ్ళమూరు, గోడితిప్ప, ఎంట్రుకోన, ఎస్.పల్లిపాలెం, దేవగుప్తం, తాడికోన, గుండెపూడి, బోడసకుర్రు సచివాలయాలకు చెందిన గ్రేడ్-5 కార్యదర్శులకు జీఓ ప్రతులను ఎంపీడీఓ అందించారు. డీడీఓ హోదా పొందిన సచివాలయ కార్యదర్శులు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని మండల పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరబాబు, రవిరాజు, కనకమ్మ, కుమారి పాల్గొన్నారు.



గేడ్-5 కార్యదర్శులకు జీవో ప్రతిని అందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

సూర్య నమస్కారాలు, యోగ శిక్షణ

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా ఉపాధ్యాయురాలు దువ్వూరి సుబ్బలక్ష్మి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం పిల్లలకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, క్లబ్ కార్యదర్శి యరమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారి కె.విజయలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, శ్రీగిరి పద్మావతి, భమిడిపాటి కనకాద్రి శాస్త్రి, పుత్సా కృష్ణ కామేశ్వర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు

సైన్స్ ఎగ్జిబిషన్లతో సృజనాత్మకత

అంబాజీపేట: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ హన్సి అబ్రహం, కరస్పాండెంట్ రేణి ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను విద్యార్థులు తయారుచేయడం అభినందనీయమన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో సైన్స్ ఉపాధ్యాయులు పి.అరుణ్‌ప్రకాష్, ఐ.రాజశేఖర్, ఎ.భీమశంకరం రవీంద్ర పర్యవేక్షణలో 300 మంది విద్యార్థులు పాల్గొని 150 పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. సర్పంచ్ అనిశెట్టి నాగలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నాగబత్తుల సత్యానందం, మామిడిశెట్టి బలరామకృష్ణ, ఆర్‌సీఎం చర్చి ఫాదర్స్ వినయ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలి

అల్లవరం: ప్రతి గ్రామంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సీఐ వీరబాబు అన్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన బోడసకుర్రులో గురువారం ఎన్నికల నిర్వహణపై వివిధ పార్టీల నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకుని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టపర్తి షణ్ముఖరావు, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వీరబాబు

బాలుడికి చేయూత

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న బాలుడు సాగిరెడ్డి భాస్కర్ ఇందీవర్‌కు వసుధ ఫౌండేషన్ రూ.30 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేసింది. ఈ మేరకు బాలుడి ఇంటి వద్ద ఆ చెక్కును ఫౌండేషన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జంపన బుజ్జీరాజు పంపిణీ చేశారు. భాస్కర్ పరిస్థితిని ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు బుజ్జీరావు తెలపడంతో తక్షణం స్పందించి సాయమందించారు. మరో ప్రతినిధి బోణం రాజు, స్థానికుడు గిడుగు సుబ్బారావు పాల్గొన్నారు.



అంతర్వేదికరలో బాలుడికి సాయం చెక్కు ఇస్తున్న బుజ్జీరాజు

ఇళ్ల స్థలాలు పరిశీలించిన తహసీల్దార్

ఆత్రేయపురం: స్థానికంగా ఇళ్ల స్థలాలను గురువారం తహసీల్దార్ ఎం.వెంకటరామయ్య పరిశీలించారు. స్థలాలను పేదలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సుమారు 550 మందికి స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వం స్థల సేకరణ చేసింది. దీంతో స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు స్థలం చూపించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. దీంతో సిబ్బంది పనులు వేగవంతం చేశారు. అనంతరం మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. ఆర్ఐ భవానీ, వీఆర్వో జ్యోతి, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరామయ్య